నూతన కమిటీ ఏకగ్రీవం



నూతన కమిటీ ప్రతినిధులు

బోడుప్పల్: ఎస్.ఐ.ఎస్. కాలనీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దీటి గణేష్, గౌరవ అధ్యక్షుడిగా కొండ అయిలయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఉమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సురేష్‌యాదవ్, కోశాధికారిగా రవీందర్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేష్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజలందరినీ కలుపుకొని అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. కాలనీ ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ఏకగ్రీవంగా చేసిన ఎన్నికల కమిటీ గౌరవ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అయోడిన్‌పై అవగాహన ర్యాలీ



పీహెచ్‌సీ ఆధ్వర్యంలో
ర్యాలీ చేపడుతున్న మెడికల్ సిబ్బంది

ఉప్పల్: అయోడిన్ విరివిగా ఉండే పదార్థాలను తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అయోడిన్ లోపం వల్ల అనేక రుగ్మతలు దరి చేరుతాయని అయోడిన్ లోపం రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డాక్టర్లు ప్రచారం నిర్వహించారు. ఈ ర్యాలీ ఉప్పల్ పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైంది. డా.మల్లేశ్వరి, డా.భాను, విజయ్‌కుమార్, బోగ ప్రకాష్, మహేష్‌గౌడ్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆదాయం కోసం.. ఆర్టీసీ కొత్త మార్గాలు

కళాశాలల సమయాల్లో ఆర్డినరీ బస్సుల నిలిపివేత

- బస్టాండ్ నుంచి బయల్దేరుతున్న 10 బస్సులు
- 8 మెట్రో బస్సులు, 2 ఆర్డినరీ బస్సులు
- మెట్రోలో కాంబినేషన్ టికెట్ పై వెళ్తున్న విద్యార్థులు
- బస్‌పాస్ ఉన్నప్పటికీ విద్యార్థుల అగచాట్లు

ఆర్టీసీ అధికారులు తమ లాభాపేక్షతో ఉదయం విద్యార్థుల సమయాల్లో ఆర్డినరీ బస్సులు నడపడం లేదు. పది బస్సులు బస్టాండ్ నుంచి బయలుదేరితే అందులో 8 మెట్రో బస్సులు, రెండు ఆర్డినరీ సర్వీసులు ఉంటున్నాయి. మెట్రో సర్వీసులలో విద్యార్థులు ప్రయాణించాలంటే బస్‌పాస్ ఉన్నా చూయించి అదనంగా రూ.10 ఇస్తే కాంబినేషన్ టికెట్ తీసుకోవాలి. దీంతో విద్యార్థులకు నిత్యం పాస్ ఉన్నా అదనంగా రోజుకు రూ.20 వెచ్చించాల్సి వస్తుంది. దీంతో తల్లిదండ్రుల జేబులకు చిల్లుపడుతోంది. అధికారులు విద్యార్థుల అవస్థలు దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల సమయాల్లో బస్ పాసులు చెల్లుబాటు అయ్యే ఆర్డినరీ సర్వీసులను నడపాలని డిమాండ్ చేస్తున్నారు.

రోజుకు 5వేల మంది వరకు..

మేడ్చల్ నుంచి మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్సిటీ, ఇతర కళాశాలలకు, కండ్లకోయ సీఎంఆర్ కళాశాలతో పాటు ఇతర కళాశాలలు, సుచిత్రలోని వివిధ కేటగిరిల్లో ఉన్న ఇంటర్, డిగ్రీ కళాశాలలకు, సికింద్రాబాద్ ఇతర ప్రాంతాల్లో ఉన్న కళాశాలలకు, సుచిత్ర వరకు వివిధ ప్రైవేటు పాఠశాలలకు నిత్యం వందల మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. మహిళా విద్యార్థులకు ఉచిత ప్రయాణం కావడం, రాష్ట్రేతర విద్యార్థులు హాస్టల్‌లో ఉండి చదువుకునే వారు ఎక్కువగా ఉండటంతో వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి.

అన్ని సర్వీసులను నడిపిస్తున్నాం..



ఏ సమయంలోనైనా అన్నీ బస్సులను నడిపిస్తున్నాం. ఆర్డీనరీ బస్సులతో పాటు, మెట్రో బస్సులు, ఇతర బస్సులు అన్ని వేళల్లో నడుస్తున్నాయి. విద్యార్థుల సమస్యలను సైతం పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తాం.
– సుధాకర్, మేడ్చల్ డిపో మేనేజర్

మేడ్చల్ నుంచి నగరం, నగర శివార్లలో మేడ్చల్‌కు చెందిన వందలాది మంది విద్యార్థులు నిత్యం ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేస్తున్నారు. ఆర్టీసీని లాభాల బాటలో నడపాలని ఆ సంస్థ ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఆర్టీసీ అవలంభిస్తున్న కొన్ని అనవసర ఆలోచనలతో విద్యార్థుల తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీ బస్‌పాస్ ఉండటంతో ఆ పాస్‌తో విద్యార్థులు చదువుకోవడానికి కళాశాలలకు నిత్యం ఉదయం వేళల్లో విద్యార్థులకు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు ప్రయాణ సమయం. కాగా నగరానికి గంట ప్రయాణం ఉండటంతో విద్యార్థులు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు మేడ్చల్ బస్టాండ్‌కు చేరుకుని తమ గమ్యస్థానాలతో పాటు కళాశాలలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేస్తున్నారు. – మేడ్చల్

బస్‌పాస్ ఉన్నా రోజుకు రూ.20 అవసరమవుతున్నాయి..



ఉదయం, సాయంత్రం వేళల్లో తమ బస్‌పాసులు చెల్లుబాటు అయ్యే సర్వీసులు లేకపోవడంతో మెట్రో బస్సులలో ప్రయాణం చేసి నిత్యం రూ.20తో కాంబినేషన్ టికెట్ తీసుకుంటున్నాం. నెలకు కాంబినేషన్ టికెట్ కోసం రూ.600, బస్‌పాస్ కోసం రూ.450 వెచ్చిస్తున్నాం. నెలకు ప్రయాణం కోసం రూ.1050 ఖర్చు చేయాల్సి వస్తోంది.
– ఎస్‌కే. అద్నాన్, మేడ్చల్ విద్యార్థి

రెండోరోజు గ్రూప్ -1 పరీక్షలు ప్రశాంతం

మల్కాజిగిరి: మల్కాజిగిరి పీఎస్ పరిధిలో రెండో రోజు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ప్రోబుల్స్ ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌లోని సెంటర్లలో మొత్తం 1394 మంది అభ్యర్థులకు 447 మంది గైర్హాజరయ్యారు.
రామంతాపూర్ : గ్రూప్ – 1 మెయిన్స్ పరీక్షల కోసం ఏర్పాటు చేసిన మెగా మహిళా డిగ్రీ కళాశాల, వైదేహి మహిళా డిగ్రీ కళాశాల, స్ఫూర్తి డిగ్రీ కళాశాలల పరీక్షా కేంద్రాల్లో రెండోరోజు మంగళవారం నిర్వహించిన జనరల్ వ్యాస పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి

మల్లాపూర్: నాచారం హెచ్‌ఎంటీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు వేంకటేశ్వరాచార్యులు అర్చకుల బృందం పర్యవేక్షణలో శ్రీనివాసకల్యాణం కనుల పండువగా జరిగింది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయి జెన్‌శేఖర్‌తో కలిసి పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

మల్లికార్జుననగర్ నూతన కమిటీ ఎన్నిక

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ మల్లికార్జుననగర్ నూతన కమిటీ మంగళవారం ఎన్నికైంది. అధ్యక్షులుగా కొండోజు అశోక్‌చారి ఎన్నికయ్యారు. వీరితో పాటు సభ్యులు చిన్న పెంటయ్య, ఉపేందర్, సుందర్, వరప్రసాద్‌చారి, సంతోష్‌రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. వీరిని బీఆర్‌ఎస్ నేత కొండల్‌రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

గోపాల్‌రెడ్డికి గ్లోబల్ పీస్ అవార్డు



గోపాల్‌రెడ్డిని అవార్డుతో సత్కరిస్తున్న దృశ్యం

బోడుప్పల్: బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి మహాత్మ గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు– 2024, సేవా రత్న పురస్కార్ – 2024 పొందారు. ఈ మేరకు తెలంగాణ సరస్వతీ పరిషత్ ఆడిటోరియంలో జరిగిన మహాత్మ గాంధీ జయంతి, అంతర్జాతీయ అహింసా దినోత్సవ ముగింపు వేడుకల్లో ఈ అవార్డులను ఆయనకు ప్రదానం చేశారు. మాజీ ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ దయానంద్, న్యాయమూర్తి చంద్రకుమార్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్‌ల చేతుల మీదగా అవార్డును అందుకున్నారు. ఈ అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందని గోపాల్‌రెడ్డి చెప్పారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మేయర్

బోడుప్పల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నాయని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 28వ డివిజన్‌లో మంగళవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్షయ నిర్మూలన హెల్త్ క్యాంపునకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో క్షయ వ్యాధి ప్రాణాంతకంగా ఉండేదని, ప్రస్తుతం వ్యాధి నివారణకు పూర్తిస్థాయి మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వాలు కూడా క్షయవ్యాధి రహిత సమాజం కోసం నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. క్షయ వ్యాధి వచ్చినా భయపడాల్సిన అవసరం లేదన్నారు. కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, నేతలు రాపోలు ఉపేందర్, రామస్వామి, చీరాల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌ల ఆధ్వర్యంలో మంగళవారం హెచ్‌ఎండీఏ, హెచ్‌ఎండబ్ల్యూఎస్,ఎస్‌బీ, ఎలక్ట్రిసిటీ, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ కమిషనర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ భీమ్‌రెడ్డి నవీన్‌రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, పప్పుల అంజిరెడ్డి, యాసారం మహేష్, దేవేందర్‌గౌడ్, కృష్ణగౌడ్, ఈశ్వర్‌రెడ్డి, కో– ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డీఈ సాయినాథ్‌గౌడ్, టీపీఓ సుకన్య, కరెంట్ ఏఈ సత్యనారాయణ, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మౌలాలి: బీజేపీ ఆధ్వర్యంలో 137 డివిజన్‌లోని 145 బూత్ నెంబర్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, వీకే మహేష్, ఆర్‌కే శ్రీనివాస్, ఓంప్రకాష్, శ్రీనివాస్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌ల ఆధ్వర్యంలో 26వ డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్పొరేటర్ భీమ్‌రెడ్డి నవీన్‌రెడ్డి, నాయకులు మాడుగుల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని ఎస్టీబస్తీ ఏకలవ్యనగర్, కృష్ణానగర్‌లో మంగళవారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అధికారులతో కలిసి పర్యటించారు. కృష్ణానగర్ కాలనీలో నాలాను ప్రారంభించేందుకు ఎల్లమ్మ దేవాలయం నుంచి 450 ఎంఎం డయా పైపులైన్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈఈ శ్రీకాంతి, డీఈ ప్రశాంతి, ఏఈ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్, శానిటేషన్, ఎస్‌ఎఫ్‌ఏలు, కాంగ్రెస్ నేతలు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, వెంకటేష్, సందీప్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్ నవీన్, సుదర్శన్, దేవ, శంకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై యువతి ఫిర్యాదు

మల్కాజిగిరి: మానసికంగా, లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై ఓ మహిళ మల్కాజిగిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి ఏపీఐఐసీ కాలనీకి చెందిన ఎస్‌ఎస్ ప్రశాంతి ఓ న్యూస్ ఛానెల్‌తో పాటు ప్రైవేటు ఆసుపత్రిని నిర్వహిస్తోంది. మూడేళ్ల క్రితం నీల్‌రాజ్ అలియాస్ మామిడాల కనకరాజు పాస్టర్‌తో ఉన్న వివాదాన్ని పరిష్కరించాలని ఆమెను కోరాడు. మధ్యవర్తుల ద్వారా ఆమె ప్రయత్నించినా పనికాకపోవడంతో ఆమెను తరచూ ఫోన్ ద్వారా వేధించేవాడు. ఆమె నిర్వహించే ఆసుపత్రికి ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడేవాడు. గతేడాది రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో అతను వైరల్ చేసిన వీడియోలపై ఫిర్యాదు చేసింది. ఆమెకు మద్దతుగా ఉన్న ఓ మహిళను కూడా బెదిరిస్తూ ఈనెల 7న రాత్రి ఆమె ఇంటికి వచ్చాడు. అదే రోజు ఆమెపై మరో వీడియో వైరల్ చేసి బెదిరించడంతో ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

స్టామ్ వాటర్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయండి



కాప్రాలో పర్యటించిన ఎల్బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్



జోనల్ కమిషనర్‌తో ఎమ్మెల్యే బండారి

కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం కాప్రా సర్కిల్‌లో పర్యటించారు. భాస్కర్‌రావునగర్, ఈశ్వర్‌పురి కాలనీ, హైటెన్షన్ రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. వర్షపునీరు చెరువులో కలవకుండా డ్రైనేజీలో కలుస్తుండటంతో తక్షణమే స్టామ్‌వాటర్ ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సైనిక్‌పురి ఈ పార్క్ వెనుక భాగం నుంచి వివిధ కాలనీల మీదుగా కాప్రా చెరువులో వర్షపునీరు కలిసే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, ఇతర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నాచారంలో ప్రజా సమస్యలపై..

మల్లాపూర్: ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి మంగళవారం నాచారంలో పర్యటించారు. నాచారం ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్‌జామ్‌తో నిత్యం వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్ శాంతిసాయి జెన్‌శేఖర్ ఎమ్మెల్యే, జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. హబ్సిగూడ జంక్షన్ వద్ద నాచారం నుంచి ఉప్పల్ వెళ్లేందుకు ఫ్రీ లెఫ్ట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నాచారంలో యూటర్న్ పాయింట్‌లు దూరంగా ఉండటంతో చాలామంది వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్లి ప్రమాదాలకు గురౌతున్నారన్నారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ.. త్వరలోనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు. కాప్రా డీసీ జగన్, నాచారం సీఐ రుద్వీర్‌కుమార్, ఈఈ నాగేందర్ తదితరులున్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న
నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్

రక్తదానం.. ప్రాణదానం

మల్లాపూర్: రక్తదాతలు ప్రాణాదాతలు అని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మామిడాల సంతోష్‌రెడ్డి మిత్రం బృందం ఆధ్వర్యంలోల దాదాపు 25 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులను మంగళవారం ఇన్‌స్పెక్టర్ అభినందించి సర్టిపికెట్లను అందజేశారు. అనంతరం సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీస్ అమరుల సేవలు మరువ లేనివని కొనియాడారు. విధి నిర్వహణలో పోలీసులు ఎన్నో ఇబ్బందులు ఆటుపోట్లను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. లోకేందర్‌రెడ్డి, రమాకాంత్, రమేష్ పటేల్, సునీల్‌బాబు, కృష్ణ, కిషోర్‌రెడ్డి, శ్రీధర్‌ప్రసాద్‌రెడ్డి, గురు, విజయకుమార్‌సింగ్, శ్రీధర్, శివ, మహేష్‌రెడ్డి, శ్రీకాంత్, సాత్విక్‌రెడ్డి, శ్రీతన్‌రెడ్డి, నవీన్ సందీప్,స్టీబాఫ్టిన్ తదితరులు పాల్గొన్నారు.

భారత యువజన సంఘం భవనాన్ని నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ పెద్దలు

ఉప్పల్: పెండింగ్‌లో ఉన్న ఉప్పల్ భారత యువజన సంఘం భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం యువజన సంఘం అధ్యక్షుడు అర్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉప్పల్ పట్టణ పెద్దలు, యువజన సంఘం ప్రతినిధులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సభ్యులు, గ్రామ పెద్దల సూచనల మేరకే భవనం నిర్మించాలని తీర్మానించినట్లు తెలిపారు. మేకల శివారెడ్డి, అశోక్‌కుమార్‌గౌడ్, నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, వీరారెడ్డి, కృష్ణగౌడ్, జగన్నాథ్‌గౌడ్, మేకల హనుమంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భాస్కర్, ధర్మారెడ్డి, లక్ష్మణ్, జితేందర్‌రెడ్డి, సుధాకర్ శెట్టి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో ప్రజలు భాగస్వాములవ్వాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న బెల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్

మల్లాపూర్: అవినీతి నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని బెల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం మల్లాపూర్ పారిశ్రామికవాడలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ నవరత్న డిఫెన్స్ ప్రభుత్వ రంగ సంస్థ ఆధ్వర్యంలో నిఘా జాగృతి వారోత్సవాల సందర్భంగా అవినీతి నిర్మూలనపై బెల్ కంపెనీ నుంచి ఎలిఫెంట్ సర్కిల్, బెల్ సర్కిల్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. అవినీతి నిర్మూలన ప్రజలందరి కృషితోనే సాధ్యమవుతుందన్నారు. నవంబర్ 3వ తేదీ వరకు పాఠశాలలు, కళాశాలలు, గ్రామాల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో దాదాపు 300 మంది ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి



నాగార్జుననగర్ కాలనీలో స్థానికులతో
మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, నాగర్జుననగర్ కాలనీ రోడ్డు నెంబరు–1లో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులకు సూచించారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలిసి రోడ్డు నెంబరు–1ను పరిశీలించారు. పనుల ఆలస్యంపై అధికారులను అడిగి తెలుసుకున్న కార్పొరేటర్ పనులు తొందరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం ఈసీనగర్‌లోని సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఇంజినీరింగ్ డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అల్వాల్ డివిజన్‌లోని అయ్యర్ బస్తీలో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, అల్వాల్ సర్కిల్ ఏఎంహెచ్‌ఓ రజినితో కలిసి మొక్కలు నాటారు. ఎస్‌ఎస్. ప్రభాకర్, కాలనీవాసులు పీకే.నర్సింహ, నరేందర్, స్వామి, శ్రీధర్, నర్సింహులు, సారధి, చంద్రశేఖర్, అరుణ, శ్రీలక్ష్మి, సురేఖ, విశాలి, ప్రశాంతి, అరుణ, నాయకులు మల్లేష్‌గౌడ్, శరణ్, గిరి, యాదగిరిగౌడ్, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్‌డ్రైన్ నిర్మాణానికి చర్యలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ చిన్మయిమార్గ్‌లో బాక్స్‌డ్రైన్ నిర్మాణం, ఇతర తాగునీటి పైపులైన్లపై మంగళవారం అధికారులు పరిశీలించారు. అనంతరం జేసీబీ సాయంతో తవ్వకాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూమ్ ఇళ్లను అందజేయాలి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సింగం చెరువు తండాలో మొత్తం 176 డబుల్‌బెడ్రూమ్‌లను నిర్మించగా 127 మంది లబ్ధిదారులకు ఇళ్లను అందజేశారు. మిగిలిన 48 మందికి ఇళ్లను ఇవ్వాలని కోరుతూ మంగళవారం ప్రజాభవన్‌లో సింగం చెరువుతండా అధ్యక్షులు పీరు నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మాజీ సీఎం ఇచ్చిన హమీ మేరకు తండావాసులు, లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్‌లను అందజేయాలన్నారు. గత పదేళ్లుగా అద్దె ఇళ్లలో ఉంటూ తండావాసులు నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

